సీతాదేవి అప్రెంటిస్‌గా చేరి అప్పటికి నెలరోజు లవుతుంది. ఒకసారి చూస్తే మళ్ళీమళ్ళీ చూడాలనిపించేటంత అందమేమీకాదు సీతాదేవిది. చామన ఛాయ రంగులో, ఏదో మామూలుగా ఉంటుంది. వయసు తెచ్చిన నిండుతనం, విగారింపు కూడ సీతాదేవిలో అంతంత మాత్రమే. బక్క పలచనా, చాల సామాన్యంగా ఉంటుంది. పోతే అలంకరణ.. అది తెచ్చిన ఆకర్షణ, అసలు లేనే చెప్పాలి. రెండే జతల నేత బట్టలు.. అవీ రంగు వెలిసినవి వేసుకుంటుంది.

అయినా సీతాదేవి, బహుశా సెక్షనంతటికీ ఒకతే ఆడది కావడం వల్లనేమో, ఒక ప్రత్యేక ఆకర్షణ అయిపోయింది ఈ నెల్లాళ్ళుగా. అస్తమానం సెలవులు, లేట్ పర్మిషన్లు పెట్టే కుమార్, శర్మ వగైరాలు, ఇప్పుడు చాలా పంక్చువల్‌గా ఉంటు న్నారు. కొత్త కొత్త వేషాలు.. స్టైల్స్.. ఏదో పని కల్పించుకొని సీతాదేవితో మాట్లాడటానికి పోటీ పడటం.. ఏవేవో పిచ్చి జోకులు పేల్చటం..

అంతా గమనిస్తూనే ఉన్నాడు సెక్షన్ సూపరిం టెండెంట్ రంగనాథం. అయినా చూసీ చూడ నట్లుగా పోతున్నాడు.

అణకువ, వినయ విధేయతలు మూర్తీభవించి నట్లుండే సీతాదేవి మీద ఎంతో సదభిప్రాయం ఉంది రంగనాథానికి. పనిలో ఆమె చూపే నేర్పు, ఓర్పు ఎంతో ముచ్చటగా ఉంటాయి. ఈ కుర్ర గాడిదలు, ఉత్త 'సోడా రాయుళ్ళు' తప్ప ఎందుకూ పనికిరారు అని ఆయన స్వగతంగా చాలసార్లే అను కున్నాడు.

ఆరోజు సాయంత్రం ఆఫీసు అయిపోయాక, దాదాపు సెక్షన్ అంతా నిర్మానుష్యంగా ఉంది. రంగనాథం ఇంకా ఏవో ఫైల్సు ముందేసుకొని, తీవ్రంగా పనిలో నిమగ్నమయి ఉన్నాడు.

అలికిడి అయితే తలెత్తి చూచాడు.

పైట నిండుగా కప్పుకొని, ఏదో సంశయిస్తూన్న దానిలా, క్రిందకు చూస్తూ నిల్చొని ఉంది సీతాదేవి. ముఖంలో దైన్యం గూడు కట్టు కొని ఉంది.

ఆమెనలా చూస్తూంటే, కడుపులో ప్రేమ కదలినట్టయింది రంగనాథానికి. ఇది ఆయనకి మామూలే! నిర్భాగ్యుల్ని, నిస్సహాయుల్ని చూస్తే ఆయన మనసు వెన్నలా కరిగిపోతుంది. ఈ మెత్తని మనసువల్ల, ఆయన అప్పుడప్పుడు చిన్న చిన్న ఇబ్బం దులు పడుతూనే ఉంటాడు.

"ఏమమ్మా.. ఏంకావాలి.. అలా కూర్చో", కళ్ళజోడు తీసి టేబిల్‌పైన పెట్టి అన్నాడు.

ఆయన గొంతులోని మార్దవానికో, లేక తన నిస్సహాయతకో, ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"చూడు తల్లీ! నీకు నేను తండ్రిలాంటి వాడిని. అలా కూర్చుని ఏం జరిగిందో చెప్పు" అనున యంగా అన్నాడు రంగనాథం.

ఆమె కూర్చుంది.

సీలింగు ఫాను శబ్దం తప్ప, ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది కాసేపు.

"నాకు ఓ ఇరవై రూపాయలు కావాలండీ. పదో తారీఖుకి, స్టైపెండు రాగానే మళ్ళీ ఇచ్చేస్తాను" అంది సీతాదేవి గొంతు బలవంతంగా పెగుల్చుకొని.

ఆయన నొచ్చుకుంటూ, "అయ్యో.. అంతమాత్రా నికేనా?" అంటూ పర్సుతెరిచి, ఇరవై నోటు అందించాడు రంగనాథం.

మళ్ళీ రంగనాథమే అన్నాడు., "చూడమ్మా! నీకు ముందే చెప్పాను. నేను నీకు తండ్రిలాంటి వాడి ని, నీకే ఇబ్బంది కలిగినా నాతో చెప్పు, నేను ఏ కాస్త నీకు సాయం చేయగలిగినా సంతో షిస్తాను. ఆఫ్టరాల్, మనమంతా మనుషులం. పైగా ఒకకప్పు క్రింద కాలాన్ని గడుపుతున్నవాళ్ళం.



# మానవత్వపు పరిమళాలు

కుప్పాల వెంకట సుబ్బారావు

ఈ మాత్రం ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకొని, చిన్న చిన్న సాయాలైనా చేసుకోలేకపోతే, ఈ మనిషి బ్రతుక్కిక అర్థం లేదు" అన్నాడు రంగనాథం.

మనసులో కృతజ్ఞతా భావం పొంగి పొర్లు తూంటే, అప్పుడు మనసు విప్పి తన కథ నిలా చెప్పింది సీతాదేవి.

"మా నాన్న చిన్నప్పుడే పోయాడు సార్. మా అమ్మ నాన్నలకి నేనొక్కర్తినే సంతానం. అమ్మ దీనా వస్థని చూచి ఆదుకోకపోగా, అంతవరకు చాల సన్ని హితులుగా ఉన్న చుట్ట పక్కాలు క్రమక్రమంగా దూరమవడంతో, అమ్మ ఏకాకి అయింది. అంత వరకూ ఎండ కన్నెరుగని అమ్మ, భుక్తి కోసం, వీధిన పడింది. కూలీనాలీ చేసుకుంటూ నన్ను ఇంత దాన్నిచేసి, చదువు సంధ్యలు చెప్పించింది. ప్రస్తుతం అమ్మ అనారోగ్యంతో ఉంది. నాకు ఎలాగో ఈ అప్రెంటిస్ ఉద్యోగం దొరికింది. ఒక సంవత్సరం పాటు దిగులులేదు. అప్రెంటిస్ షిప్ అయ్యాక ఇక, అప్పటి సంగతి అప్పుడు!.

ఆయన సానుభూతిగా చూస్తూ, "ఫరవా లేదమ్మా, ఏం దిగులు పడకు. కాస్త కూస్త తేడాగా దేశంలో నూటికి తొంభై మందిమి ఒక్కలాగే ఉన్నాం. గుండె ధైర్యం, రేపటి మీద ఆశ... ఇవే బతుకుని నడుపుతున్నవి. ఇక వెళ్ళిరా. మళ్ళీ బస్సుకి ఇబ్బంది అవుతుందేమో" అన్నాడు.

చేతులు జోడించి, "వెళ్ళొస్తానండీ" అని కాస్త భారం తీరిన మనసుతో బయట పడింది సీతాదేవి.

రోజులు మామూలుగానే గడుస్తున్నాయి.

ఆ రోజు ఉదయం అటెండెన్స్ రిజిస్టరులో సంతకాలు పెట్టి ఒక్కొక్కరూ అప్పుడే సీట్లలోకి వస్తున్నారు.

సీతాదేవి పేరు ఒక్కటే ఆఖరిషీటులో ఉంటుంది, ఆ షీట్ తీసి, అంతలోనే షాక్ తిన్నట్లయి, దాన్ని అక్కడే వదిలేసి, చకచకా తన సీట్లోకి వచ్చి కూర్చుంది సీతాదేవి. చూస్తూండగానే ఆమె కళ్ళు ఎర్రబారి నీళ్ళు నిండాయి. ఎవరూ చూడకుండా పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంది.

కానీ రంగనాథం గమనించనే గమనించాడు.

ఆమె పక్కగా వెళ్ళి, "సీతాదేవీ! ఏం జరిగిం దమ్మా" అన్నాడు ఆమెకు మాత్రం వినిపించేలా.

"ఒక్కసారి అటెండెన్స్ రిజిస్టర్ చూడండి" తల వంచుకునే అంది సీతాదేవి.

రంగనాథం వెళ్ళి ఒక్కొక్క సీట్ చూశాడు. ఆఖరి సీటు చూడగానే అతని ఒళ్ళు కంపరమెత్తింది. "ఛీ ఛీ. దౌర్భాగ్యపు వెధవలు" అని తిట్టుకుని పెన్ను తీసి సీతాదేవి పేరు ఎదురుగా అసహ్యకరంగా వేసి వున్న బూతు బొమ్మని చకచకా కొట్టి వేశాడు రంగనాథం.

సీరియస్‌గా వెళ్ళి కూర్చున్నాడు.

ఈ ఏ పని వెధవ చేసి ఉంటాడా అని ఆయన మెదడు చకచకా ఆలోచించింది. అనుమానం అందరి మీదుగా సాగిసాగి ఆఖరికి కుమార్ మీద నిలిచింది. కుమార్ పై మధ్యతరగతి చెందిన వాడు. ఆడపిల్ల లాగ అలంకరించుకుంటాడు. ఏవో కుర్రకారు లక్షణాలు తప్ప, ఇంత అసహ్యకరంగా అతనైనా ప్రవర్తిస్తాడా అని నమ్మకం కలగలేదు రంగనాథానికి. ఎంత సేపు ఆలోచించినా ఆలోచనలు ఒక పట్టాన తెగ లేదు.

ఒక్కటి మాత్రం నిజం. అబలల్ని, నిస్సహాయుల్ని ఆదుకోగలగటం మానవత్వం. అయితే మానవుడు







ఆరోగ్యకరమైన, ఉల్లాసకరమైన
కేశ సంపదకై కొత్త పామోలివ్ ఎగ్-షాంపూ

ఇప్పుడు మీ కుటుంబానికి వారి కేశ సంరక్షణకై విశిష్ట ఎగ్-ప్రోటీన్ ఇవ్వవచ్చు... పామోలివ్ ఎగ్ షాంపూలో కొత్త పామోలివ్ ఎగ్ షాంపూలోని విశిష్ట ఎగ్-ప్రోటీన్ జుట్టును పోషించి, ఆరోగ్యకరంగానూ, తొణికిసలాడేలా కనబడేట్లు చేస్తుంది.

మీ కుటుంబం యొక్క కేశ సంరక్షణకై చాలైన విశిష్ట ప్రోటీన్ పోషణగల కొత్త పామోలివ్ ఎగ్-షాంపూ తీసుకురండి.

పామోలివ్ ఎగ్ షాంపూ
మీ కుటుంబానికి ఆరోగ్యకరమైన
తొణికిసలాడే కేశ సంపద

PES. G. 5 TL

మానవుడిగానే మసలగలిగితే, మానవ చరిత్ర మరో రకంగా ఉండేది.

యథా ప్రకారం రోజులు గడుస్తూనే ఉన్నాయి.

సీత సీటు దగ్గిర ఈ మధ్య కుమార్ తచ్చాడటం ఎక్కువయింది. ఏదో ఇన్‌ఫర్మేషన్ అడిగే నెపంతో ఆమె టేబిల్ మీద మోచేతులు ఆనించి ఆమెతో మాట్లాడుతుండటం చూశాడో రోజు రంగనాథం.

అదయ్యాక, ఏదో నిర్ణయించుకున్న వాడల్లా రంగనాథం కుమార్‌ని తన సీటుదగ్గరకు పిలిపించాడు.

ఎదురుగా కూర్చున్నాడు కుమార్.

"మిస్టర్ కుమార్! సీత మీద నీ అభిప్రాయం ఏమిటి?" సూటిగా చూస్తూ అడిగాడు.

క్షణ కాలం ప్రతిభు డయినట్లు కనిపించాడు కుమార్.

"సీత కేం సార్. మంచిపిల్ల" అన్నాడు.

"సీత దగ్గిర తరచూ నువ్వు తచ్చాడటం ఆమెతో మాట్లాడడానికి, నువ్వు పదేపదే తాపత్రయ పడటం అంతా నేను గమనిస్తూనే ఉన్నాను. అంతా చూశాక, నాకో విషయం ప్రపోజ చేయాలని పిస్తూంది. మీ ఇద్దరికీ ఈడూ జోడూకూడా బాగుంటుంది. ఆమెను నువ్వెందుకు పెళ్ళి చేసుకో కూడదూ?" కుమార్ దగ్గిర తన కున్న స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకుని అడగ వలసిన మాటే అడిగాడు రంగనాథం.

కుమార్ కాసేపు ఆలోచించినట్లే కనిపించాడు.

ఏ లాభనష్టాలు బేరీజు వేసుకున్నాడో ఏమోగాని ఆలోచనల్లోంచి తెప్పరిల్లుకొని, "మారేజీ అంటే మాటలా సార్. ఇంటి దగ్గర పెద్దలు" అని ఆపైన నాన్చేశాడు కుమార్.

..."ఆ అమ్మాయి మీద మీదికి వంగి మాట్లాడినంత సులువుకాదు మారేజీ అంటే!. . .ఆ సంగతి నువ్వు ఒప్పుకున్నట్టేగా! అందుచేత మాటిమాటికి ఆమె దగ్గరకలా వెళ్ళకు. బావుం డదు" అని ఫైలు తెరిచాడు రంగనాథం.

రంగనాథం వంక ఆదోలా చూస్తూ, నెమ్మదిగా లేచాడు కుమార్.

* * *

సీతాదేవికి ట్రయినింగు కాలం పూర్తయింది. మళ్ళీ కొత్త అప్రెంటిస్ బాచ్‌ని రిక్రూట్ చేసేంతవరకు ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు.

సీతాదేవికి దిగులు దిగులుగా ఉంది.

ప్రస్తుతం ఏదో గుట్టుగా సంసారం సాగి పోతూంది. ఇక మీదట, ఆ స్టైపెండు డబ్బులు కూడా రాకపోతే ఎలా కాలం వెళ్ళదీయగలం?! భవిష్యత్తంతా అగమ్యంగా, అంధకారంగా అన్పించింది.

కానీ, సరిగ్గా మరో నెల రోజులు తిరిగే సరికి ఏ దేవుడో కరుణించినట్టు సీతాదేవిని, మొత్తం ఆ అప్రెంటిస్ బాచ్ నంతటినీ అబ్జార్బ్ చేస్తూ ఆర్డర్స్ వచ్చాయి.

కొత్తగా మరో అప్రెంటిస్ బాచ్ వచ్చింది.

సీతాదేవి కంటికి, 'ఇది కలయో, వైష్ణవ మాయయో' అన్నట్లుంది. జన్మజన్మలకీ తీరదేమో అన్నంత దౌర్భాగ్యం ఒక్కరోజుతో తీరిపోయింది. వాడి వాడి పోయిందనుకున్న జీవితంలో

**అవివేకికి ఆరు లక్షణా లన్నది ఆరసే సామెత. అకారణమైన ఆగ్రహం, ప్రయోజనంలేని వాగుడు, అభివృద్ధికి అవకాశం లేని మార్పు, అనవసరమైన విచారణ, కొత్తవాణ్ణి విశ్వసించడం, మిత్రుల్ని శత్రుషులుగా భావించడం — ఈ ఆరూ అజ్ఞానుల లక్షణాలు.**

వేయి వసంతాలు విరిసి నట్టయింది.

ఆమె లాగే సంతోషించిన వాడు రంగనాథం.

"పోనీలేమ్మా. ఆదేవుడు దయ తల్చాడు" అన్నాడు ఆనందంగా రంగనాథం.

"మీ చల్లని మాట, మీ చల్లని దీవెన వృథా పోలేదు బాబాయిగారూ" అంది సీతాదేవి, ఆనందాశ్రువులు కళ్ళను నింపేస్తూంటే.

ఆ తరువాత రోజులు చకచకా జరిగిపోయాయి.

సీతాదేవి ఇప్పుడు ఖరీదయినవి కాకపోయినా రంగు రంగు బట్టలు, రకరకాల బట్టలు కట్టు కుంటూంది. కొద్దిగా ఒళ్ళు చేసింది. బోసి మెడలో బంగారు గొలుసు మెరిసింది.

ఇప్పుడు సీతాదేవిచూడముచ్చటగా ఉంటూంది.

ఇన్నిన్ని అందాలు, ఇన్నిన్ని సొగసులు ఇన్నాళ్ళూ ఎక్కడ దాక్కున్నట్టు?!

ఆమెలో ఇప్పుడు కన్పిస్తూన్న అందాలకి, చలాకీతనానికి, దిగులు స్థానే ముఖంలో విరుస్తూన్న చిరునవ్వులకి ఆశ్చర్యమూ, సంతోషమూ కలుగుతున్నాయి రంగనాథానికి.

తనకే గనుక శక్తి ఉంటే ఒక్కక్షణంలో, ఈ లోకంలోని ఏడ్పులని, దౌర్భాగ్యాన్ని, దిగుళ్ళని, విచారాల్ని భస్మీపటలంచేసి, సకల జీవరాసుల్నీ సంతోష తరంగాల్లో ముంచి తేల్చాలన్పించింది ఆయనకి.

ఆ మధ్య కొంత కాలం దూర దూరంగా ఉన్న కుమార్ మళ్ళీ ఈ మధ్య సీతాదేవికి దగ్గరగా మసలడం సాగించాడు.

రంగనాథం అంతా గమనిస్తూ, కుమార్‌ని చూచి లోలోపలే నవ్వు కుంటున్నాడు.

ఒకరోజు కుమార్, రంగనాథానికి ఎదురుగా, ఏదో తటపటాయిస్తున్నట్టుగా కూర్చున్నాడు.

కన్పొత్తి చూచాడు రంగనాథం.

"మీరు నన్ను మరోలా అనుకోకపోతే నేను .. నేను... సీతాదేవిని పెళ్ళి చేసుకోవాలనుకుంటు న్నాను." ఎలాగో పూర్తి చేశాడు, కుమార్.

రకరకాల జీవితానుభవాలతో తల నెరిసిన రంగనాథం తొందరపడి ఏం మాట్లాడలేదు.

బాగా ఆలోచించాడు.

కాసేపు గడిచాక "నీకు ఏ విషయం తర్వాత చెబుతాను" అన్నాడు.

మరుసటి రోజు సెలవు రోజు. ఆరోజు సీతాదేవిని ఇంటికి రమ్మని చెప్పాడు రంగనాథం.

చెప్పినట్టుగా ఆ రోజు ఉదయం రంగనాథం ఇంటికి వెళ్ళింది సీతాదేవి.

ఇద్దరూ పక్క పక్కనే కూర్చున్నారు.

రంగనాథం భార్య కాఫీలు తెచ్చిచ్చింది.

తర్వాత రంగనాథం చెప్పడం సాగించాడు.

"చూడమ్మా! కుమార్‌ని నువ్వు చాన్నాళ్ళుగా ఎరుగుదువుకదా! సాంప్రదాయికమైన కుటుంబం. దేనికీ లోటులేని కుటుంబం. నువ్వు అంగీకరిస్తే, నిన్ను చేసుకోవడానికి అతను ఇష్టపడుతున్నాడు. బాగా ఆలోచించాక నువ్వు అతన్ని చేసుకుంటే, మీ జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా సుఖంగా గడిచి పోతుందనిపించింది. అందుచేత..."

సీతాదేవిలో ఏ మార్పూ రాలేదు. నిర్వికారంగా ఉంది.

మెల్లిగా తల దించుకుంది.

ఆమెనుంచి సమాధానం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తుండి పోయాడు రంగనాథం.

ఆమె మెల్లిగా గొంతు విప్పింది.

"కానీ . . మీరు అనుమతిస్తే నేను రాజుని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను బాబాయిగారూ" అంది.

"రాజంటే మన సెక్షన్‌లోని అప్రెంటిస్సేనా?!" మౌనంగా తలూపింది సీతాదేవి.

ఆశ్చర్యంలోంచి తేరుకోవడానికి చాలసేపే పట్టింది రంగనాథానికి.

సీతాదేవి తరువాత బేచిలో అప్రెంటిస్‌గా వచ్చిన వాడు రాజు. రాజుని చూస్తుంటే సీతాదేవి కొత్తగా తమ సెక్షన్‌లోకి వచ్చిననాటి 'కళే' అతనిలోనూ కన్పిస్తూంటుంది.

అదే గూడుకట్టుకున్న దిగులు.. అవే రంగు వెలిసిన పాత బట్టలు. అదే బలహీనత. . .అదే దౌర్భాగ్యం... అతనిలో అన్నీ ఆనాటి సీతాదేవిలోని లక్షణాలే!

"అవును బాబాయిగారూ! రాజు పరిస్థితి చూస్తూంటే నాకు చాల సానుభూతి కల్గుతోంది. తల్లితండ్రులకి పెద్దకొడుకు. తల్లితండ్రులతో పాటు ఇంకో చెల్లెలు. అందరూ అతనిమీదే ఆశలు పెట్టుకొని ఉన్నారు. తిండిలేక అప్పుడప్పుడు వాళ్ళు పస్తులుగూడా ఉంటారు. మా వివాహం జరిగితే ఏ సుఖభోగాలు మేము అనుభవించ లేక పోవచ్చు. నా జీతం ఆ కుటుంబానికి ఆధార మవుతుంది. పస్తుల నుంచి ఒక కుటుంబాన్ని ఆదుకున్న దాననవుతాను. పస్తులంటే ఏమిటో నాకు తెలుసు బాబాయిగారూ. నా జీవితానికి పస్తుల నుంచి ఒక కుటుంబాన్ని తప్పించగలగడంకంటే పరమార్థం ఏముంటుంది చెప్పండి." గత కాలపు ఏ భయంకర స్మృతులు ఆ మనసును కలుక్కు మన్పించాయోగాని, చివరి మాట అంటున్నప్పుడు, ఆమె గొంతు గాద్గదికమై, కన్నుల్లో నీరు చిప్పిల్లింది.

ఆమె ఆలోచనా సరళికి రంగనాథం మనసు మెత్తగా కరిగిపోసాగింది. ఆమె ఆ క్షణంలో మూర్తీభవించిన మానవత్వంలా కన్పించింది. మనిషి బ్రతుక్కి, మనిషి మనుగడకి భాష్యం చెబుతున్న ఆ చిన్నారి సీతాదేవిని చూస్తూ రంగనాథం పరవశించి పోయాడు. స్వార్థం, కుళ్ళు, కుత్సితాలతో దుర్గంధ భూయిష్ఠంగా మారిన సమాజ జీవనంలో అరుదుగా గుబాళించే మానవత్వపు సుమధుర పరిమళాలను ఆయన ఆ క్షణాన మనసారా ఆఘ్రాణించాడు. ☆